సాక్షి తిరుపతి

శనివారం । 11 । ఫిబ్రవరి । 2023



తిరుపతి బులియన్

బంగారం :
24 క్యారెట్లు 10 గ్రాములు రూ.58,850
22 క్యారెట్లు ఒక గ్రాము రూ.5,357
వెండి:
హోల్‌సేల్ ధర (కిలో) రూ.68,600
రిటైల్ వెండి గ్రాము రూ.70.60

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	34	18
చిత్తూరు	34	17
తిరుమల	30	14
గూడూరు	34	19
నగరి	35	18



వెంకన్న బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

చంద్రగిరి : శ్రీనివాస మంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు శుక్రవారం శాస్త్రోక్తంగా అంకురార్పణ చేపట్టారు. శనివారం ఉదయం ధ్వజారోహణం చేపట్టనున్నారు.

న్యూస్‌రీల్

మహాశివరాత్రికి 414 ప్రత్యేక బస్సులు



చెంగల్‌రెడ్డి, డీపీటీఓ

తిరుపతి అర్బన్: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు జిల్లా వ్యాప్తంగా 414 బస్సులు నడపనున్నట్టు జిల్లా ప్రజారవాణాశాఖ అధికారి తిమ్మాడి చెంగల్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 17, 18, 19 తేదీల్లో ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు చెప్పారు. 17న 85 బస్సులు, 18న 194, 19వ తేదీన 107 సర్వీసులను తిప్పడానికి అన్ని ఏర్పాట్లు చేసినట్టు వెల్లడించారు. తిరుపతి–శ్రీకాళహస్తి, తిరుపతి–తలకోన, తిరుపతి–గుడిమల్లం, శ్రీకాళహస్తి–నాయుడుపేట, శ్రీకాళహస్తి–పిచ్చాటూరు, శ్రీకాళహస్తి–చెన్నై, శ్రీకాళహస్తి–గుడిమల్లం పుత్తూరు–సదాశివకోన, పుత్తూరు–కైలాసకోన, ఊతుకోట–సదాశివకోన, వరదయ్యపాళెం–అవంతికి ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు.

రోడ్డు విస్తరణపై రైతులతో జేసీ సమావేశం



రైతులతో మాట్లాడుతున్న జేసీ బాలాజీ

చంద్రగిరి: తిరుపతి–మదనపల్లి జాతీయ రహదారి విస్తరణలో భూమిని కోల్పోతున్న మిట్టపాళెం, నాగపట్ల రెవెన్యూకు సంబంధించిన 20 మంది రైతులతో శుక్రవారం జాయింట్ కలెక్టర్ బాలాజీ స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారి విస్తరణ ద్వారా ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. భూముల విలువ మరింత పెరుగుతుందని పేర్కొన్నారు. ప్రస్తుతం 2022 నాటి నోటిఫికేషన్ ప్రకారం రైతులకు పరిహారం చెల్లిస్తామని తెలిపారు. రేణిగుంట, ముంగిలిపట్టు తదితర ప్రాంతాలకు చెందిన కొందరు రైతులు 2018లో పరిహారంపై కోర్టును ఆశ్రయించారని తెలిపారు. కోర్టులో కేసు పరిష్కారమయ్యేనాటికి రైతులు చాలా నష్టపోవాల్సి వస్తుందని వివరించారు. సాగుభూమి, కన్వర్షన్ చేసిన భూమిగా విభజించి వేర్వేరుగా పరిహారం చెల్లిస్తామని తెలిపారు. రైతులు అంగీకరించడంతో సమావేశం సంతృప్తికరంగా ముగిసినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ శిరీష, భూ సేకరణ అధికారి లక్ష్మీనరసయ్య, డీటీ ఈశ్వర్‌రెడ్డి, ఆర్‌ఐ సులోచనమ్మ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయంలో డ్రోన్ వినియోగంపై అవగాహన



భాకరాపేట: చిన్నగొట్టిగల్లు మండలం చిట్టేచర్ల పంచాయతీలో శుక్రవారం వ్యవసాయంలో డ్రోన్ వినియోగంపై రాస్ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త శ్రీనివాసులు రైతులకు అవగాహన కల్పించారు. డ్రోన్ ద్వారా పంటలకు క్రిమిసంహారక మందు పిచికారీ చేయడం ద్వారా సమయం ఆదా, కూలీల కొరత అధిగమించడం, తక్కువ ఖర్చు తగ్గుతుందని తెలిపారు. సర్పంచ్ నాగచెంగమనాయుడు, శాస్త్రవేత్త సుధాకర్, రైతులు పాల్గొన్నారు.

అదనంగా రూ.10 చెల్లిస్తే చాలు

తిరుపతి అర్బన్: చదువుల నిమిత్తం విద్యార్థులు ఆర్టీసీ బస్సు పాస్‌లు పొందుతున్న విషయం తెలిసిందే. వీరంతా ఆర్డినరీ సర్వీసులో మాత్రమే ప్రయాణం చేయడానికి అర్హులు. దశాబ్దాలుగా ఇదే కొనసాగుతోంది. అయితే రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల అవసరాలను గుర్తించి ఎక్స్‌ప్రెస్‌లోనూ ప్రయాణం చేయడానికి అవకాశం కల్పించింది. బస్ పాస్ కలిగిన విద్యార్థులు అదనంగా రూ.10 చెల్లిస్తే(ఒక్కసారికి) ఎక్స్ ప్రెస్‌ల్లోనూ ప్రయాణించవచ్చని డీపీటీఓ చెంగల్‌రెడ్డి తెలిపారు. అత్యవసరం నేపథ్యంలో అవసరమైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

శ్రీశైలానికి ఆన్‌లైన్ బుకింగ్

తిరుపతి అర్బన్: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేయడానికి పలు ప్రాంతాలకు ఆన్‌లైన్‌లో టిక్కెట్ బుకింగ్ చేసుకునే సౌకర్యం ఉంది. అయితే తాజాగా శుక్రవారం నుంచి శ్రీశైలానికి వివిధ ప్రాంతాల నుంచి ఆర్టీసీ సర్వీసుల్లో వెళ్లడానికి వీలుగా ఆన్‌లైన్ బుకింగ్ సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. ప్రయాణికులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రజారవాణా అధికారి చెంగల్‌రెడ్డి తెలిపారు.

విడిపోతున్న హీట్‌షీల్డ్



కొనసాగుతున్న రాకెట్ ప్రయాణం



జానుస్-1 ఉపగ్రహం



ఆజాదీశాట్-2 ఉపగ్రహాన్ని విడిచిపెడుతూ..





నిప్పులు చిమ్ముకుంటూ నింగివైపు వెళుతున్న ఎస్ఎస్ఎల్‌వీ డీ2 రాకెట్.

గఘన విజయం!

ఇస్రో శాస్త్రవేత్తలు ఈ ఏడాది తొలి 'గఘన' విజయాన్ని నమోదు చేశారు. శుక్రవారం షార్‌లో మొదటి ప్రయోగ వేదిక నుంచి స్మాల్ శాటిలైట్ లాంచింగ్ వెహికల్ (ఎస్ఎస్ఎల్‌వీ డీ2) ప్రయోగాన్ని విజయవంతంగా పూర్తిచేశారు. మూడు ఉపగ్రహాలను దిగ్విజయంగా సూర్య సమకాలిక కక్ష్యలోకి ప్రవేశపెట్టారు. 119 టన్నుల బరువున్న ఉపగ్రహాలను నాలుగు దశల్లో మొత్తం 15.38 నిమిషాల్లో పూర్తిచేశారు. భూమికి అతితక్కువ దూరంలోని 450 కిలో మీటర్ల ఎత్తులో ఉపగ్రహాలను ప్రవేశపెట్టి ఇస్రో అమ్ముల పొదిలో మరో కొత్తరకం రాకెట్‌ను చేర్చారు.

- ఎస్ఎస్ఎల్‌వీ డీ2 ఉపగ్రహ ప్రయోగం విజయవంతం
- సూర్యసమకాలిక కక్ష్యలోకి మూడు ఉపగ్రహాలు
- ఇస్రో అమ్ములపొదిలో కొత్తరాకెట్ చేరిక
- ఇక వాణిజ్యపరమైన ప్రయోగాలవైపు దూసుకెళ్లనున్న వైనం

సూళ్లూరుపేట : భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) శాస్త్రవేత్తలు సరికొత్తగా దూసుకుపోతున్నారు. సూళ్లూరుపేట సమీపంలోని సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ (షార్)లో మొదటి ప్రయోగవేదిక నుంచి శుక్రవారం స్మాల్ శాటిలైట్ లాంచింగ్ వెహికల్ (ఎస్ఎస్ఎల్‌వీ డీ2) ప్రయోగాన్ని విజయవంతంగా పూర్తిచేశారు. వేకువజామున 2.18 కౌంట్‌డౌన్‌ను ప్రారంభించి ఉదయం 9.18 గంటలకు ప్రయోగాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఇకపై ఇస్రో వాణిజ్యపరమైన ప్రయోగాల వైపు కూడా దూసుకెళ్లనుంది.

అత్యంత తక్కువ వ్యయం

అతి తక్కువ వ్యయంతో విదేశాలకు చెందిన బుల్లి ఉపగ్రహాలతో పాటుగా ఒక మోస్తరు బరువున్న ఉపగ్రహాలను, దేశ విదేశాల్లో ఉన్న ఐఐటీ విద్యార్థులు ప్రయోగాత్మకంగా తయారుచేసిన అతి బుల్లి ఉపగ్రహాలను పీఎస్ఎల్‌వీ రాకెట్‌లో ఉపయోగించారు. 2020లోనే ఈ ప్రయోగాన్ని నిర్వహించాలనుకున్నారు. కానీ ఆ సమయంలో కరోనా వల్ల ప్రయోగం ఆలస్యమైంది. చిన్న తరహా ఉపగ్రహాలను అత్యంత తక్కువ వ్యయంతో ప్రయోగించేందుకు ఈ స్మాల్ శాటిలైట్ లాంఛింగ్ వెహికల్‌ను డిజైన్ చేశారు. అయితే గత ఏడాది ఆగస్టు 7న ఎస్ఎస్ఎల్‌వీ డీ1 పేరుతో చేసిన ప్రయోగం విఫలమైనట్టుగా ఇస్రో ప్రకటించింది. ఆ ప్రయోగంలో జరిగిన పొరపాట్లను సరిచేసుకుని ఈ సారి అత్యంత అధునాతనమైన సాంకేతిక పరికరాలను రూపొందించుకుని ఎస్ఎస్ఎల్‌వీ డీ2 రాకెట్‌ను ప్రయోగించారు. ఇప్పటిదాకా ఎస్ఎల్‌వీ, ఏఎస్ఎల్‌వీ, పీఎస్ఎల్‌వీ, జీఎస్ఎల్‌వీ, జీఎస్ఎల్‌వీ మార్క్3 రాకెట్లను మాత్రమే డిజైన్ చేశారు. సరికొత్తగా ఎస్ఎస్ఎల్‌వీ కూడా ఇస్రో జాబితాలో చేరింది.

ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు

వరదయ్యపాళెం/సూళ్లూరుపేట: ఎస్ఎస్ఎల్వీ రాకెట్ రెండవ ప్రయోగం విజయవంతం కావడంతో తిరుపతి ఎంపీ గురుమూర్తి, సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, చెంగాళమ్మ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ బాలచంద్రారెడ్డి, మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి, తదితరులు హర్షం వ్యక్తం చేశారు. ఇస్రో శాస్త్రవేత్తలను అభినందనలతో ముంచెత్తారు.

రాకెట్ ప్రయోగం ఇలా..

- ఎస్ఎస్ఎల్‌వీ డీ2 రాకెట్ 34 మీటర్లు పొడవు, 2 మీటర్లు వెడల్పు
- 119 టన్నుల బరువుతో నాలుగు దశల్లో 15.38 నిమిషాలకు ప్రయోగం పూర్తి.
- 87 టన్నుల ఘన ఇంధనాన్ని ఉపయోగించి 124 సెకన్లకు మొదటి దశను పూర్తిచేశారు.
- 162.4 సెకన్లకు రాకెట్ శిఖరభాగాన ఉపగ్రహాలను అమర్చిన హీట్‌షీల్డ్ విడిపోయింది.
- 7.7 టన్నుల ఘన ఇంధనంతో 385.8 సెకన్లకు రెండో దశ పూర్తి.
- 4.5 టన్నుల ఘన ఇంధనంతో 675.1 సెకన్లకు మూడో దశ పూర్తి.
- నాలుగో దశలో వెలాసిటీ ట్రిమ్మింగ్ మోటార్‌లో నింపిన 0.05 టన్నుల ద్రవ ఇంధనం సాయంతో 683.7 సెకన్లకు కటాఫ్.
- తర్వాత 808.6 సెకన్లకు 156.3 కేజీల బరువు కలిగిన ఎర్త్ అబ్జర్వేషన్ ఉపగ్రహాన్ని భూమికి 450 కిలోమీటర్ల ఎత్తులోని లియోఆర్బిట్‌లోకి మొదటిగా ప్రవేశపెట్టారు.
- అంటారిస్ యూఎస్‌ఏకి చెందిన 10.2 కేజీల బరువు కలిగిన జానుస్ -1 అనే ఉపగ్రహాన్ని 903.6 సెకన్లకు ప్రవేశపెట్టారు.
- 8.7 కేజీల బరువు కలిగిన ఆజాదీశాట్ -2 అనే ఉపగ్రహాన్ని 923.6 సెకన్లకు అంటే 15.38 నిమిషాలకు భూమికి 450 కిలోమీటర్లు ఎత్తులోని లియో అర్బిట్ (సూర్య సమకాలిక కక్ష్య)లోకి ప్రవేశపెట్టారు.
- 900.1 సెకన్లకు ప్రయోగాన్ని పూర్తి చేయాలనుకున్నారు. కానీ అదనంగా 23 సెకన్లు తీసుకుని ఈ ప్రయోగాన్ని విజయవంతం చేశారు.
- కక్ష్యలోకి చేరుకున్న మూడు ఉపగ్రహా ఆరోగ్యకరంగా ఉన్నాయని ఇస్రో చైర్మన్ ఎస్ సోమనాథ్ ప్రకటించారు.
- షార్ నుంచి 85వ ప్రయోగం ఎస్ఎస్ఎల్‌వీ డీ2 రాకెట్.
- ఎస్ఎస్ఎల్‌వీ సిరీస్‌లో ఇది రెండో రాకెట్.
- ఈ ఏడాదికి ఇదే మొదటి రాకెట్.

శిలాన్యాసం..భక్తజన పరవశం





వేలాది మందితో సామూహిక హారతి(ఇన్‌సెట్) హారతి సమర్పిస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి

- జాతరను తలపించిన తాతయ్యగుంట గంగమ్మ గర్భాలయ శిలాన్యాసం
- వేదమంత్రోచ్ఛారణల నడుమ రాతి కట్టడం ఆరంభం
- సామూహిక హారతులతో పులకించిన భక్తజనం
- గంగమ్మకు సారె సమర్పించిన ఎమ్మెల్యే భూమన దంపతులు

తిరుపతి కల్చరల్: అత్యంత ప్రాచీన చరిత్ర కలిగిన తిరుపతి గ్రామదేవత శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా చేపట్టిన గంగమ్మ గర్భాలయ శిలాన్యాసం రాతికట్టడ ఆరంభం శుక్రవారం వైభవోపేతంగా సాగింది. ముందుగా తుడా కార్యాలయం నుంచి అమ్మవారి ఆలయం వరకు మంగళ వాయిద్యాల నడుమ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి దంపతులు, మేయర్ డాక్టర్ శిరీష గంగమ్మ తల్లికి సంప్రదాయబద్ధంగా సారెను తీసకొచ్చి సమర్పించారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని గోపూజ నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రదక్షిణ చేసి హోమ గుండ అగ్నిప్రతిష్ఠ చేశారు. తర్వాత నిర్ణీత శుభ ముహూర్తాన అమ్మవారి గర్భాలయ రాతి కట్టడ స్థాపన ఘట్టానికి శ్రీకారం చుట్టారు. భక్తులు, స్థానికులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఆలయ చైర్మన్ కట్టాగోపీయాదవ్, ఈఓ ఎం.మునిక్రిష్ణయ్య, పాలక మండలి సభ్యులు, ఆలయ అర్చకులు, వేద పండితుడు విభీషణశర్మ తదితరులు పాల్గొన్నారు.

సామూహిక హారతికి శ్రీకారం

అమ్మవారి గర్భాలయ రాతి కట్టడం నేపథ్యంలో శుక్రవారం రాత్రి ప్రప్రథమంగా సామూహిక హారతి చేపట్టారు. ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి దంపతులతోపాటు మేయర్ శిరీష తదితరులు పాల్గొన్నారు. టీటీడీ వేద అధ్యయన సంస్థ వేద పండితులు, వేద పాఠశాల విద్యార్థులు హాజరై వేద పండితుడు విభీషణశర్మ వ్యాఖ్యానం చేస్తుండగా దుర్గ స్తోత్రం, స్త్రీ స్తోత్రం పఠించారు. అనంతరం ఎమ్మెల్యే గంగమ్మ ఆలయ సుదీర్ఘ చారిత్రికత, విశిష్టత, జాతర వైభవాన్ని వివరించారు. తిరుమల శ్రీవారు స్వయాన తన చెల్లెలుగా ప్రకటించిన అమ్మవారు తిరుపతి గంగమ్మ అని తెలిపారు. తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి ఆలయానికంటే పురాతన ఆలయం గంగమ్మ ఆలయమని ఎమ్మెల్యే వెల్లడించారు.



హోమ పూజలో ఎమ్మెల్యే భూమన దంపతులు, మేయర్ శిరీషా, ఆలయ అధికారులు

దేవుడి దయతో చల్లగా ఉండాలి



ఆలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

- మహాగణపతి ఆలయ కుంభాభిషేకంలో మంత్రి పెద్దిరెడ్డి

పలమనేరు: దేవుడి దయ, కరుణతో ప్రజలందరూ చల్లగా ఉండాలని రాష్ట్ర అటవీ, ఇంధన, గనులశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. పలమనేరు మున్సిపాలిటీ పరిధిలోని గంటావూరు ఇందిరమ్మ కాలనీలో టెర్రకోట హస్తకళాకారులు నిర్మించిన మహాగణపతి నూతన ఆలయ కుంభాభిషేకంలో భాగంగా ఆయన శాలివాహన చక్రవర్తి, మొల్ల విగ్రహాలను ప్రారంభించారు.
ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున తాను రాజకీయాలు మాట్లాడనని, కేవలం ఆలయ ప్రారంభోత్సవం చేశామని తెలిపారు. ఆలయం వద్ద పుణ్యాహం, బింబ అగ్ని యోచనం, పంచగవ్యాధి వాస్తు క్షీరం, ప్రభూతబలి, శయణాధి వాసం తదితర కైంకర్యాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంకటేగౌడ, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, మున్సిపల్ చైర్‌పర్సన్ పవిత్ర మురళీకృష్ణ, ఏఎంసీ చైర్మన్ హేమంత్‌కుమార్ రెడ్డి, పట్టణ కన్వీనర్ జాఫర్, మున్సిపల్ వైస్ చైర్మన్లు చాన్మా కమాల్, కిరణ్‌కుమార్, మాజీ ఎంపీపీ రాజేంద్రన్, ఆలయ నిర్వాహకులు, టెర్రకోట హస్తకళాకారుల సంఘ అధ్యక్ష, కార్యదర్శులు రామక్రిష్ణ, మోహన్, కుప్పం నియోజకవర్గ పరిశీలకులు మొగసాల రెడ్డెప్ప, పెద్దపంజాణి కన్వీనర్ బాగారెడ్డి, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నకిలీ ఓటర్లు ఉంటే ఊరుకోం

తిరుపతి అర్బన్: 'ప్రశాంతమైన వాతావరణంలో ఎమ్మెల్సీ ఎన్నికలు నిర్వహించాలి. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలి. ఓటర్ల జాబితాలో నకిలీ ఓటర్లు ఉంటే ఊరుకునేది లేదు' అని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి హెచ్చరించారు. శుక్రవారం ఆయన కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎన్నికల నిర్వహణపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ నకిలీ ఓటర్లు ఉంటే వాటిని గుర్తించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. మండల స్థాయిలో ఆయా తహసీల్దార్లు రాజకీయ పార్టీల నేతలతో సమావేశం నిర్వహించి, ఎన్నికల నియమావళిని వివరించాలని సూచించారు. ఈవీఎంల ద్వారా కాకుండా బ్యాలెట్ బాక్సులతోనే ఎన్నికలుంటాయని వెల్లడించారు. ఫ్లెక్సీల తొలగింపు, తొలగించిన వివరాలు ప్రోఫార్మలో నింపాలని స్పష్టం చేశారు. అడిషనల్ ఎస్పీ వెంకటరావు మాట్లాడుతూ స్టేషన్ హౌస్ ఆఫీసర్లు మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ ప్రకారం ర్యాలీలు నిర్వహిస్తే ప్రచార పర్మిషన్ ఉండేలా చూడాలని, రోజూ ఉల్లంఘన వివరాలు ప్రోఫార్మాలో పూర్తిచేసి పంపాలని చెప్పారు. డీఆర్వో శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ఎన్నికల వివరాలను తెలియజేస్తున్న కలెక్టర్

జడ్జికి అదనపు బాధ్యతలు

తిరుపతి లీగల్ : రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఎర్రచందనం కేసుల విచారణ సెషన్స్ కోర్టు ఇన్‌చార్జి న్యాయమూర్తిగా తిరుపతి 5వ అదనపు జిల్లా జడ్జి అన్వర్‌బాషా ఇన్‌చార్జి న్యాయమూర్తిగా నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా కోర్టు ఉత్తర్వులు జారీచేసింది. ఎర్రచందనం కేసుల విచారణ కోర్టు జడ్జి నాగరాజు సెలవుపై వెళ్లడంతో ఈనెల 14వ తేదీ వరకు ఆయన ఇన్‌చార్జి న్యాయమూర్తిగా కొనసాగనున్నారు.

రాష్ట్రానికే తలమానికంగా విశాఖ

- పరిపాలనా రాజధానిగా అడ్డంకులు లేకుండా చూడు స్వామీ
- అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ వీరభద్రస్వామి


తిరుపతి మంగళం : విశాఖ రాజధాని రాష్ట్రానికే తలమానికంగా మారుతుంద డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి తెలిపారు. తిరుమల శ్రీవారి దర్శనానంతరం తిరుపతికి విచ్చేసిన ఆయన శుక్రవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. విశాఖపట్నం పరిపాలనా రాజధాని అయిన నేపథ్యంలో ఎలాంటి అవాంతరాలు రాకుండా చూడాలని శ్రీవేంకటేశ్వరస్వామిని ప్రార్థించినట్టు తెలిపారు. ఆసియాలోనే అత్యంత అభివృద్ధి చెందుతున్న నగరాల్లో విశాఖ ఒకటి అని చెప్పారు. అలాంటి నగరాన్ని రాష్ట్ర రాజధానిగా చేయడంతో అభివృద్ధి శరవేగంగా జరుగుతుందన్నారు. ఉత్తరాంధ్ర, ఉభయ గోదావరి జిల్లాల ప్రజలు విశాఖను రాజధానిగా స్వాగతిస్తున్నారన్నారు. టీడీపీ హయాంలో చంద్రబాబు తన అనుచరులు రియల్‌ఎస్టేట్ దందా చేసేందుకే అమరావతిని నిర్మించుకున్నారే తప్ప ప్రజావసరాల కోసం కాదన్నారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజాసంక్షేమాన్ని ఆకాంక్షించిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మూడు రాజధానులను ప్రకటించారని తెలిపారు.

సొంత జిల్లాలోనే యువగళంకు ఆదరణ కరువు

చంద్రబాబు సొంత జిల్లాలోనే ఆయన తనయుడు లోకేష్ చేస్తున్న పాదయాత్రకు ప్రజాదరణ లేకుండా పోయిందని డెప్యూటీ స్పీకర్ తెలిపారు. పక్క జిల్లాల నుంచి టీడీపీ నాయకులను పిలిపించుకుని పాదయాత్ర సాగిస్తున్నారని చెప్పారు. ప్రజాసమస్యల పరిష్కారానికి నాడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర చేస్తే.. నేడు లోకేష్ చేస్తున్న యువగళం పాదయాత్ర కేవలం అధికార దాహంతోనే సాగుతోందని చెప్పారు. జిల్లాలో పాపులారిటీ కోసం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని విమర్శిస్తుండడం వారి నీచ రాజకీయాలకు నిదర్శనమన్నారు. లోకేష్ పాదయాత్ర ఆడియో రిలీజ్ చేసిన అచ్చెన్నాయుడు వైఎస్సార్‌సీపీలోకి వచ్చే పరిస్థితి లేక, ఇతర పార్టీల్లోకి వెళ్లలేక గత్యంతరం లేక టీడీపీలోనే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. రాబోయే ఎన్నికల్లో 175 స్థానాలకు 175స్థానాలు గెలిచి తీరుతామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

కరోనా కనుమరుగు!

ప్రపంచాన్నే గడగడలాడించిన కరోనా కనుమరుగైనట్లేనా? మూడేళ్లపాటు నాలుగు దశల్లో లక్షలాది మందిని చుట్టుముట్టిన ఈ వైరస్ వేలాదిమందిని పొట్టనపెట్టుకుంది. రాష్ట్ర ప్రభుత్వం వేలాది కోట్లు వెచ్చించి, చేపట్టిన నివారణ చర్యలు, అధికార యంత్రాంగం చేసిన నిర్విరామ కృషి కోవిడ్‌ను కట్టడి చేసింది. మొన్నటివరకు చైనాలో కోట్లాదిమందిని మంచమెక్కించిన ఈ మహమ్మారి జిల్లాలో మాత్రం దాని జాడ కూడా లేదు. టీకా పంపిణీని పకడ్బందీగా అమలు చేసిన జిల్లా యంత్రాంగం వైరస్‌ను నామ రూపాల్లేకుండా చేసింది.



- మూడేళ్లుగా జిల్లాను పట్టిపీడించిన కోవిడ్
- నాలుగు దశల్లో 2.8 లక్షల కేసులు
- మహమ్మారి కట్టడికి సర్కారు చర్యలు
- జిల్లాలో 2023 నుంచి జీరో

సాక్షి నెట్‌వర్క్ : జిల్లాలో 2020 నుంచి 2023 వరకు 3 లక్షలకుపైగా కోవిడ్ పరీక్షలు నిర్వహిస్తే 2.80 లక్షల కరోనా కేసులు నమోదయ్యాయి. నాలుగు దశల్లోనూ 2017 మంది మృతి చెందారు. 2020 మార్చి 26న యూకే నుంచి శ్రీకాళహస్తికి వచ్చిన ఓ వ్యక్తికి తొలి పాజిటివ్ కేసు నిర్ధారణ అయింది. వెంటనే జిల్లా అధికారులు నివారణ చర్యలు చేపట్టారు. వారితోపాటు, చుట్టుపక్కల వారికి కోవిడ్ పరీక్షలు చేసి ఆసుపత్రికి తరలించారు. ఆ వీధి మొత్తం బ్లీచింగ్ పిచికారీ చేయించారు. తరువాత ఆ ఇంటి పక్కన ఉన్న వ్యక్తులకు కూడా కోవిడ్ పరీక్షలు చేశారు. అలా మొదలైన కేసులు చివరకు 2.80 లక్షల వరకు చేరాయి. తొలి దశలో పెద్దగా మరణాల సంఖ్య లేకపోయినా, రెండో దశలో మాత్రం ఆక్సిజన్ సమస్య ఏర్పడి చాలా మంది ప్రాణాలు కోల్పోయారు. థర్డ్‌వేవ్, ఫోర్త్‌వేవ్‌లో పెద్దగా ప్రభావం చూపలేకపోయింది. దీంతో జనం ఊపిరి పీల్చుకున్నారు.

ప్రభుత్వం ముందస్తు చర్యలతో కట్టడి

అప్పట్లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తిరుపతి, చిత్తూరు, మదనపల్లె, నగిరి, శ్రీకాళహస్తి వంటి ప్రాంతాల్లోనే అత్యధికంగా కరోనా కేసులు కనిపించాయి. లక్షణాలు బయటపడితే వెంటనే వలంటీర్లు, ఆశావర్కర్లు, ఏఎన్ఎం, సచివాలయ సిబ్బంది వారి వివరాలు సేకరించి ఉన్నతాధికారులకు నివేదికలు పంపేవారు. ఆ తరువాత వారిని పరీక్షించి హోం ఐసోలేషన్‌లో ఉంచేవారు. అక్కడే బాధితులకు 14రోజులపాటు మందులు, ఆహారం ఉచితంగా అందించారు. తరువాత కేసులు పెరగడంతో ఫీవర్ సర్వేకు శ్రీకారం చుట్టారు. బయటి ప్రాంతాల నుంచి వచ్చే వారిపై పూర్తి స్థాయిలో నిఘా పెట్టేవారు. ఇలా ఎప్పటికప్పుడు ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టింది. కరోనా కష్ట కాలంలో పేద ప్రజలను ఆదుకోవడానికి ఇంటికి రూ.వెయ్యి చొప్పున ప్రభుత్వం నగదు సాయం అందించింది. ప్రతినెలా ఉచితంగా రేషన్ బియ్యాన్ని పంపిణీ చేస్తూ వచ్చింది. లాక్‌డౌన్‌ను పకడ్బందీగా అమలు చేసింది.

టీకానే ఆయుధంగా...

కేసులు అదుపులోకి రాకపోవడం, మహమ్మారి జిల్లాను చుట్టేస్తున్న సమయంలో కోవిడ్ టీకా బలమైన ఆయుధంగా నిలించింది. కోవిడ్ వచ్చిన ఏడాది తరువాత టీకాలు అమలులోకి వచ్చాయి. తొలుత ఫ్రంట్‌లైన్ వర్కర్లకు టీకా వేయించారు. ముందుగా ఈ టీకా వేసుకునేందుకు జనం కాస్త విముఖత చూపించారు. వెంటనే ప్రభుత్వం అవగాహన కల్పించి టీకాను పూర్తి స్థాయిలో అమలు చేసేందుకు చర్యలు తీసుకుంది. తొలుత కొన్ని చోట్ల మాత్రమే వ్యాక్సినేషన్ అందించారు. ఆ తర్వాత ప్రత్యేక వ్యాక్సిన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మళ్లీ మిగిలిన వాళ్లకు ఇంటి వద్దకే వెళ్లి వ్యాక్సినేషన్ వేశారు. ఈ ఫలితంగా వ్యాక్సిన్ అమలు వంద శాతం పూర్తయింది. అధికశాతం ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి వ్యాక్సినేషన్ వేసుకున్నారు. ఈ విధివిధానాలతో పూర్తి స్థాయిలో కోవిడ్ వ్యాప్తిని అధిగమించగలిగారు. 2022 డిసెంబర్ 30 తేదీతో జీరో కేసులు చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు కూడా జిల్లాలో ఒక్క కేసు నమోదు కాలేదు.

సమష్టి కృషితోనే కట్టడి



జిల్లాలో కోవిడ్ నివారణకు అన్ని శాఖల అధికారులు సమష్టిగా పనిచేస్తున్నారు. ఏ రాష్ట్రంలోనూ లేనివిధంగా మన రాష్ట్రంలో ప్రభుత్వం ఈ మహమ్మారి కట్టడికి భారీ స్థాయిలో నిధులు వెచ్చించి, పకడ్బందీగా చర్యలు తీసుకుంది. క్షేత్రస్థాయిలో సర్వేను పక్కగా చేపట్టింది. బయటి నుంచి వచ్చే వ్యక్తులను పసిగట్టింది. దీంతోపాటు కోవిడ్ కట్టడికి వ్యాక్సినేషన్ కీలకమైంది. ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి, పూర్తి స్థాయిలో టీకా పంపిణీని విజయవంతంగా చేశాం. **-రవిరాజు, డీఐఓ**

టీకా వివరాలు



మొత్తం డోసులు	-	95,49,048
ఫస్ట్‌డోస్ వేసుకున్నవారు	-	38,39,063
సెంకడ్ డోస్	-	41,55,003
ప్రికాషన్‌డోస్	-	15,54,982

కోవిడ్ పరీక్షలు	పాజిటివ్‌కేసులు	మృతులు
ఫస్ట్‌వేవ్ 1154981	89921	858
సెంకడ్ 2260913	164296	1115
థర్డ్ 152105	23568	43
ఫోర్త్ 9564	436	1

మహిళలకు ఆర్యవర్క్, ఫ్యాబ్రిక్ పెంయింటింగ్‌పై ఉచిత శిక్షణ

చంద్రగిరి: గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలకు ఉపాధి అవకాశం కల్పించేందుకు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఆంధ్రాబ్యాంకు గ్రామీణాభివృద్ధి సంస్థ డైరెక్టర్ సురేష్‌బాబు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 14 నుంచి 30 రోజుల పాటు మహిళలకు ఆర్యవర్క్, ఫ్యాబ్రిక్ పెయింటింగ్‌పై ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలకు చెంది తెల్లరేషన్ కార్డు కలిగి, 19 నుంచి 40 సంవత్సరాలలోపు వయస్సు ఉన్న వారు అర్హులని పేర్కొన్నారు. కనీసం అర్హత 10వ తరగతి ఉండాలని సూచించారు. శిక్షణ సమయంలో ట్రైనీస్‌కు ఉచిత భోజనం, రానుపోను ఒక్కసారి చార్జీలు ఇవ్వనున్నట్టు వెల్లడించారు. శిక్షణ పూర్తిచేసుకున్న వారికి ధ్రవపత్రాలను అందజేస్తామ తెలిపారు. ఆసక్తిగల వారు ఆధార్, రేషన్‌కార్డు జిరాక్స్ కాపీలు, 4 పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో నేరుగా సంస్థకు వచ్చి వారి పేరును నమోదు చేసుకోవాలని కోరారు. ఒక బ్యాచ్‌కు 25 నుంచి 30 మంది మాత్రమే తీసుకోనున్నట్టు తెలిపారు. వివరాలకు యూనియన్ బ్యాంక్ గ్రామీణాభివృద్ధి సంస్థ, ద్వారకానగర్, చంద్రగిరి. ఫోన్ 79896 80587, 94949 51289, 63017 17672 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

షార్ట్ సర్క్యూట్.. పేలిన గ్యాస్ సిలిండర్



కాలుతున్న గుడిసె

తిరుపతి రూరల్: చిగురువాడ పంచాయతీలో శుక్రవారం షార్ట్ సర్క్యూట్‌తో గుడిసెకు మంటలు అంటుకుని గ్యాస్ సిలిండర్ పేలింది. అదృష్టవశాత్తు ప్రాణాపాయం తప్పింది. వివరాల్లోకి వెళ్లితే.. చిగురువాడ పంచాయతీకి చెందిన భాస్కర్ ఇంటిని నిర్మిస్తున్నాడు. వాచ్‌మన్ ఉండడంతోపాటు నిర్మాణ సామగ్రి కోసం పక్కనే గుడిసె వేశాడు. వాచ్‌మన్ కన్నయ్య అక్కడే నివాసం ఉంటున్నాడు. శుక్రవారం షార్ట్ సర్క్యూట్‌తో గుడిసెకు మంటలు అంటుకున్నాయి. లోపల ఉన్న తలుపులు, 45 మూటల సిమెంట్, కరెంట్ మీటరు, ఇంటి సామగ్రి కాలిపోయాయి. గ్యాస్ సిలిండర్ ఒక్కసారిగా పేలిపోయింది. స్థానికులు ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. లీడింగ్ ఫైర్‌మెన్ కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. దాదాపు రూ.60 వేల నష్టం జరిగినట్లు బాధితుడు తెలిపారు. ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

78 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత



పట్టుబడిన బియ్యం వాహనంతో అధికారులు

దక్కిలి: వెంకటగిరి -రాపూరు జాతీయ రహదారి, ఫారెస్ట్ గెస్ట్ హౌస్ సమీపంలో వెంకటగిరి నుంచి నెల్లూరుకు అక్రమంగా తరలిస్తున్న 78 బస్తాల రేషన్ బియ్యాన్ని శుక్రవారం విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గత కొంత కాలంగా వెంకటగిరి కేంద్రంగా బియ్యం దందా సాగుతోంది. పక్కా సమాచారంతో విజిలెన్స్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ జీ విజయ్‌కుమార్‌రెడ్డి, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్‌ఐ ఎన్ రామకృష్ణనాయక్, వెంకటగిరి సీఎస్ డీటీ సంధ్య సిబ్బందితో కలిసి దాడులు చేశారు. ఈదాడుల్లో అక్రమంగా తరలుతున్న 3,650 కిలోల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన బియ్యం విలువ రూ.1.31 లక్షలు ఉంటుందని తెలిపారు. వెంకటగిరి పట్టణానికి చెందిన వ్యాపారి కంపా నరసింహులు అనే వ్యక్తి బియ్యం దందాకు పాల్పడుతున్నట్టు గుర్తించారు. బియ్యంతోపాటు వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. డ్రైవరు మల్లీశ్వరయ్యను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దక్కిలి పోలీసులకు అప్పగించారు.

దళితుల ఇంటి స్థలం కబ్జాకు యత్నం

- టీడీపీ నాయకులను అడ్డుకున్న మహిళా పోలీసులు



టీడీపీ నాయకుల కబ్జా నుంచి ఇంటి స్థలాన్ని కాపాడాలని వేడుకుంటున్న బాధితులు సుబ్రమణ్యం దంపతులు

చంద్రగిరి: దళితుల ఇంటి స్థలాన్ని కబ్జా చేసేందుకు యత్నించిన టీడీపీ నాయకులకు మహిళా పోలీసులు అడ్డు తగిలిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం.. మండల పరిధిలోని ఎం.కొంగరవారిపల్లి సర్వే నం.536/బి3లోని గ్రామకంఠంలో అదే గ్రామానికి చెందిన దళితుడు సుబ్రమణ్యంకు గతంలో ప్రభుత్వం ఇంటి పట్టాను మంజూరుచేసింది. సుబ్రమణ్యం అక్కడే నివాసం ఏర్పరుచుకుని జీవనం సాగిస్తున్నాడు. ఆ స్థలం జాతీయ రహదారికి ఆనుకుని ఉండడంతో అధిక ధర పలుకుతోంది. దీంతో సుబ్రమణ్యంకు చెందిన స్థలాన్ని కబ్జా చేయాలని అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు రామచంద్ర నాయుడు, రెడ్డెప్ప నాయుడు, మునిరత్నం నాయుడు, ప్రభాకర్ నాయుడు, ఢిల్లీబాబు నాయుడు పథకం వేశారు. తర్వాత సుబ్రమణ్యంకు చెందిన ఇంటిని 22 ఏళ్ల క్రితం జేసీబీతో ధ్వంసం చేసి బావిలో పడేశారు. ఇది కోర్టు వివాదంలో ఉండేది. అయితే వారికి డబ్బు, పలుకబడి ఉండడంతో వాటి నుంచి బయటపడ్డారు. ఈ క్రమంలో రెండు రోజులుగా సుబ్రమణ్యం భూమిని ఆక్రమించుకునేందుకు రంగంలోకి దిగారు. భూమిని చదును చేసి, ఫెన్సింగ్ పనులను ప్రారంభించారు. వారిని ప్రశ్నిస్తే తమపై దౌర్జన్యాలు చేసి చంపేస్తామంటూ బెదిరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం మరోసారి ఫెన్సింగ్ వేసేందుకు ప్రయత్నించగా.. బాధితులు డయల్ 100కు ఫిర్యాదు చేయంతో మహిళా పోలీసులు అడ్డుకున్నారు.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

ఎం.కొంగరవారిపల్లి భూ వివాదం మా దృష్టికి వచ్చింది. ప్రస్తుతం జరుగుతున్న పనులను మా సిబ్బంది నిలిపివేశారు. ఇరువర్గాల వద్ద ఉన్న రికార్డులను తీసుకురమ్మని తెలిపాం. రికార్డులు పరిశీలించి చర్యలు తీసుకుంటాం. **– శిరీషా, తహసీల్దార్**

ముగిసిన మహా కుంభాభిషేక పూజలు



నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో మహాకుంభాభిషేక పూజలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధాలయమైన భక్తకన్నప్ప ఆలయం, నీలకంఠేశ్వర స్వామి ఆలయాల్లో మహాకుంభాభిషేక పూజలు శుక్రవారం నాటితో ముగిశాయి. అందులో భాగంగా భక్తకన్నప్ప ఆలయంలో ధ్వజస్తంభం నూతనంగా ఏర్పాటు చేశారు. దానికి పంచలోహ తొడుగులు ధరింపజేసి కుంభాభిషేక పూజలు చేశారు. గణపతి పూజ, కలశ స్థాపన, హోమపూజలు, మంత్ర పుష్పం నిర్వహించారు. అదేవిధంగా నీలకంఠేశ్వర స్వామి ఆలయం కూడా శిథిలావస్థకు చేరుకోవడంతో దానిని పునరుద్ధరించి కుంభాభిషేక పూజలు చేశారు. ఆలయ కలశాలకు అభిషేకం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు, వేదపండితులు, ఆలయ అధికారులు, వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు.



భక్తకన్నప్ప ఆలయం వద్ద హోమ పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు



భక్తకన్నప్పకు అభిషేకాలు నిర్వహిస్తున్న అర్చక స్వాములు

సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న నరసింహారావు

తిరుపతి రూరల్: సెల్‌ఫోన్ వాడకం పెరిగిన నేపథ్యంలో విద్యార్థులు సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలని సైబర్ పీస్ ఫౌండేషన్ సీనియర్ మేనేజర్ నరసింహారావు తెలిపారు. సీగొల్లపల్లిలోని సిద్దార్థ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం ఎన్ఎస్ఎస్ యూనిట్, తిరుపతి సైబర్ క్రైం విభాగం సంయుక్తంగా సైబర్ క్రైం-సెక్యూరిటీ అంశంపై సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాలు జరుగుతున్న విధానం, నేరగాళ్ల మోసాలు, వాటిని ఎదుర్కోవడంపై పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ప్రతి విద్యార్థీ సెల్‌ఫోన్ వాడకం పెరిగిందని, సైబర్ నేరగాళ్ల ప్రకటనలు ఇచ్చి మోసాలకు పాల్పడుతున్నారని వివరించారు. తమ సెల్‌ఫోన్‌లో సెక్యూరిటీ సిస్టమ్‌ను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సైబర్ మోసాలపై 18002096789 టోల్‌ఫ్రీ నంబర్ ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ రాజశేఖర్, ఎంఆర్‌పల్లి సీఐ సురేంద్రరెడ్డి, సైబర్ క్రైం సీఐ రామచంద్రారెడ్డి, ఎస్ఐ వినోద్‌కుమార్, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.

వేరుశనగ పంటను దున్నేశారు



దున్నేసిన పంటను పరిశీలిస్తున్న ఎస్ఐ రాఘవేంద్ర

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్): మండలంలోని చిట్టత్తూరు గ్రామానికి చెందిన రైతు మురళీకృష్ణారెడ్డి సాగు చేసిన వేరుశనగ పంటను గురువారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ట్రాక్టర్లతో దున్నివేసిన ఘటన స్థానికంగా చర్చనీయాంశమైంది. ఎస్ఐ రాఘవేంద్ర కథనం.. చిట్టత్తూరు గ్రామానికి చెందిన రైతు మురళీకృష్ణారెడ్డి ఐదు ఎకరాల్లో వేరుశనగ సాగుచేశాడు. గురువారం రాత్రి ఎవరో గుర్తితెలియని వ్యక్తులు ట్రాక్టర్లతో పంట మొత్తాన్ని దున్నేశారు. అదే గ్రామానికి చెందిన ఆనంద్ రెడ్డిపై అనుమానం ఉన్నట్లు బాధిత రైతు మురళీకృష్ణారెడ్డి పేర్కొనగా.. ఈ మేరకు అతనిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. కాగా సుమారు రూ.8 లక్షల వరకు పంట నష్టం వాటిల్లినట్టు బాధిత రైతు కన్నీటిపర్యంతమయ్యాడు.

సిద్ధేశ్వర కోనలో ఇద్దరి మృతి



సతీష్, విశాల్ మృతదేహాలు

కేవీబీపురం: మండలంలోని ఆరె గ్రామంలో గల సిద్ధేశ్వరకోన(వాటర్ ఫాల్స్)లో శుక్రవారం ఇద్దరు యువకులు మృత్యువాత పడిన ఘటన స్థానికంగా విషాదాన్ని నింపింది. ఫారెస్ట్ అధికారుల కథనం.. తమిళనాడుకు చెందిన ఇద్దరు యువకులు జలపాతంలో స్నానమాచరించేందుకు వచ్చి గల్లంతయ్యారు. విషయం తెలుసుకున్న ఫారెస్ట్, పోలీస్ అధికారులు జలపాతం వద్దకు చేరుకుని గాలించగా రెండు మృతదేహాలు లభ్యమయ్యాయి. వాటిని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. తమిళనాడుకు చెందిన సతీష్(19), విశాల్(21)గా పోలీసులు అనుమానిస్తున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.